సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 7 । అక్టోబర్ । 2025



వృథాగా వంశధార

వంశధార వృథాగా పోతోంది. ప్రాజెక్టు పనుల్లో ఆలస్యం జరుగుతోంది.

- 8లో



లేడీరౌడీషీటర్‌పై ఫిర్యాదు

లేడీ రౌడీషీటర్‌పై గ్రామస్తులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఆగడాలు ఆపాలని కోరారు.

- 8లో

పారామెడికల్ కోర్సు అభ్యర్థులకు కౌన్సెలింగ్ రేపు

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ కళాశాలలోని పారామెడికల్ కోర్సుల్లో చేరాలనుకునే అభ్యర్థులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పలనాయుడు తెలిపారు. సోమవారం ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ, బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు కళాశాల పనివేళల్లో సంప్రదించాలని తెలిపారు.

న్యూస్‌రీల్

అనకాపల్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



నరసన్నపేట: అనకాపల్లి జిల్లా మర్కాపురం మండలం భీమబోయినపాలెంలో ఈ నెల 9వ తేదీన జరిగే మెడికల్ కళాశాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు, నాయకులకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజల్లో ఆవేదన వ్యక్తం అవుతుండగా.. ప్రజా వైద్య సేవలను కాపాడాలనే నినాదంతో ఈ నెల 9న మర్కాపురం మండలం భీమబోయిన పాలెంకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సందర్శన కార్యక్రమం ఉంటుందన్నారు. వైద్య రంగాన్ని ప్రజా సేవా దృక్పథంతో కొనసాగించాలన్న డిమాండ్‌తో జరగబోయే ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై పర్యటనను విజయవంతం చేయాలని కృష్ణదాస్ కోరారు.

శిశు గృహ, బాల సదన్ ఆకస్మిక తనిఖీ



శిశు గృహాన్ని సందర్శించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి హరిబాబు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అరసవల్లిలోగల శిశు గృహం, బాల సదనాన్ని సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ గృహాల్లో మౌలిక సదుపాయాలను పరిశీలించి, పిల్లల వసతి, ఆహార నాణ్యత, పరిశుభ్రతపై సవివరంగా ఆరా తీశారు. పిల్లలతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ, వారి ఆరోగ్య పరిస్థితులు, విద్యా అవకాశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆడ పిల్లలపై మరింత శ్రద్ధ చూపాలని, సమయానుసారంగా పౌష్టికాహారం అందించాలన్నారు.

రూ.89 లక్షలతో వంతెనకు ప్రతిపాదనలు



ఎల్ఎన్‌పేట కల్వర్టును పరిశీలిస్తున్న డీఈ సాగర్

హిరమండలం: ఎల్ఎన్‌పేట దబ్బపాడు గ్రామం నుంచి సరుబుజ్జిలి మండలం పాతపాడు, తెలికిపెంట మీదుగా జలుమూరు మండలం కొమనాపల్లి వెళ్లే రహదారిలో దబ్బపాడు వద్ద కనపలవానిగెడ్డపై రూ.89 లక్షలతో వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్టు ఆర్అండ్‌బీ డీఈ సాగర్ తెలిపారు. ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, జలుమూరు మండలాలను కలుపుతూ ఉన్న రహదారి ఇది. ఇటీవల వర్షాలకు రహదారి కల్వర్టు పూర్తిగా దెబ్బతింది. దీంతో డీఈ సోమవారం పరిశీలించారు. వాహన రాకపోకలకు ఇబ్బంది కలగకుండా తాత్కాలిక మార్గాన్ని ఏర్పాటుచేయాలని సిబ్బందికి సూచించారు.

బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా బహిరంగ సభ రేపు

పలాస: మందస మండలం గంగువాడ గ్రామంలో కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం పది గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొమర వాసు, జోగి అప్పారావులు సోమవారం తెలిపారు. అలాగే 9న బూర్జ మండలం మసానపుట్టిలో బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా బహిరంగ సభ ఉందని థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్‌దొర, ఎస్. సింహాచలం తెలిపారు. ఆంధ్ర ఉద్యమాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా నుంచి నంద్యాల జిల్లా వరకు పాదయాత్రను నిర్వహిస్తున్నామని పేర్కొ న్నారు.

సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం

అరసవల్లి: విజయవాడలో ఏపీ పీహెచ్‌సీ వైద్యుల రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో జరిగిన మూడో రోజు నిరసనలో జిల్లాకు చెందిన పీహెచ్‌సీ వైద్యులు సోమవారం పాల్గొన్నారు. కోవిడ్ కష్టకాలంలో ప్రాణాలకు తెగించిన వైద్యుల సమస్యలపై సర్కార్ ప్రత్యేకంగా ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలపై స్పందించి హక్కుల పత్రాలపై ఆమోదం లభించేవరకు నిరసనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు డాక్టర్ సుధీర్, ప్రతిష్టాశర్మ, సుమప్రియ, పావని, నవీన్, సాహితి, నాగేంద్ర, శ్రీనాథ్, మౌనిక, రమ్య, తేజ, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.



నవ దుర్గల దర్శనం

పలాస సూదికొండకాలనీలో నవదుర్గ పూజా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా కనకదుర్గమ్మ శోభాయాత్ర జరిగింది. ఈ సందర్భంగా వేషాలు భేష్ మనిపించాయి. తాడేపల్లిగూడెం కళాకారుల నవ దుర్గ నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. - పలాస



శ్రీచక్ర సిరిజ్యోతి

బలగ నాగావళి తీరంలో ఉన్న బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో పుష్యమాస పౌర్ణమి సందర్భంగా శ్రీచక్ర రూపేణా సిరిజ్యోతి పూజలు సోమవారం జరిగాయి. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో మహిళలు శ్రీచక్రానికి దీపాలను వెలిగించి పూజించారు. - శ్రీకాకుళం కల్చరల్



నీలి నింగిలో..నిండు జాబిలి

గౌరీ పౌర్ణమి నాడు నీలి నింగిలో పున్నమి చంద్రుడు నిండుగా దర్శనమిచ్చాడు. పల్లెల్లో పూజలు జరుగుతుండగా పైన వెండి వెన్నెలలు కురిపిస్తూ రేరాజు మెరిసిపోయాడు. పూండి ప్రాంతంలో నిర్మలమైన ఆకాశంలో నిండుగా నవ్వుతూ నెలరాజు ఇలా కనిపించాడు. - వజ్రపుకొత్తూరు

సామాన్యుడి చేతికందించలేరా..?



- రేషన్‌లో అందని కందిపప్పు
- బియ్యం, చక్కెర మాత్రమే పంపిణీ
- ఉద్దానంలో కిడ్నీ రోగులకు అందని గోధుమలు, రాగులు

వజ్రపుకొత్తూరు:

రేషన్ సరుకుల జాబితా నుంచి కందిపప్పు కనుమరుగైపోయింది. ఇదివరకు రేషన్‌లో బియ్యం, చక్కెరతో పాటు కందిపప్పును కూడా చౌకధరకే అందించేవారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కందిపప్పును పంపిణీ చేయడం ఆపేసింది. లబ్ధిదారులు అడిగిన ప్రతిసారి వచ్చే నెల వస్తుందని డీలర్లు చెప్పడం తప్ప ఇచ్చిన దాఖలా లేదు. పైగా అక్కడక్కడా రేషన్ షాపుల్లోనే ఏర్పాటు చేసిన దుకాణాల్లో కందిపప్పును విక్రయిస్తున్నారు. అదే కందిపప్పును రేషన్‌లో భాగంగా ఇస్తే ఇంకా తక్కువ రేటుకే అందించవచ్చు. కానీ ప్రభుత్వం మాత్రం విక్రయానికే మొగ్గు చూపుతోంది.

పౌష్టికాహారం ఎలా..?

జిల్లాలో 6,60,730 తెల్లరేషన్ కార్డులు ఉన్నాయి. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో రేషన్ ద్వారా అందే సరుకులతోనే పేద వాడి కుటుంబం పౌష్టికాహారం పొందగలదు. ఆ ఉద్దేశంతోనే ఇదివరకు రేషన్‌లో కందిపప్పుతో పాటు గోధుమలు, రాగులు, వంట నూనె వంటివి కూడా కొన్నాళ్లు అందించారు. కూటమి వచ్చాక రేషన్ బియ్యం, చక్కెరకు మాత్రమే పరిమితమైంది. దీంతో సామాన్యులు అధిక ధరలకు మిగిలిన వాటిని కొనక తప్పడం లేదు. మరీ ముఖ్యంగా ఉద్దానంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం రేషన్‌లో గోధుమలు, రాగుల పిండి, వంటనూనె ఇవ్వాలని చాలాకాలంగా కోరుతున్నారు. కానీ ప్రభుత్వం మాత్రం ఉన్నవి తీసేస్తోంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, అధికారులు పేద, మధ్య తరగతులకు చెందిన కిడ్నీ బాధిత ప్రజల ఆవేదనను పరిగణనలోకి తీసుకోవాలని ఉద్దానం వాసులు కోరుతున్నారు.

కిడ్నీ వ్యాధి గ్రస్తులను దృష్టిలో ఉంచాలి



ప్రభుత్వం కిడ్నీ వ్యాధిగ్రస్తులను దృష్టిలో ఉంచుకుని గోధుమలు, కందిపప్పు, వంట నూనెలను రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయాలి. మా గ్రామంలో ఎక్కువ మంది కిడ్నీ రోగులు ఉన్నారు. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో అత్యధిక మంది కిడ్నీ రోగులు ఉన్నందున తగిన నిర్ణయం తీసుకోవాలి. గత ప్రభుత్వం ప్రతి నెల కంది పప్పు అందించేది. కూటమి ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– దున్న నాగేశ్వరరావు, యూఆర్‌కేపురం

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ప్రస్తుతం రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు పంపిణీ చేయడం లేదు. కిడ్నీ రోగులకు గోధుమలు, రాగులు, వంట నూనెలు అవసరమే. వారి డిమాండ్‌ను అధికారుల దృష్టికి తీసుకెళతాం.

– కె.రామారావు, సీఎస్‌డీటీ, వజ్రపుకొత్తూరు

పదోన్నతి.. పాత జీతమే గతి

- పండిట్లకు జీతాలు లేని పదోన్నతులు
- మార్చిలో పదోన్నతులు పొందిన వారికి నేటికీ ఎస్జీటీ స్థాయి జీతాలే
- పోస్టులు అప్‌డేట్ చేయకుండా ఖజానా శాఖ అనుమతి లేకుండా పదోన్నతులు
- పండిట్లను మభ్యపెడుతున్న ప్రభుత్వం



శ్రీకాకుళం: హిందీ పండిట్లకు పదోన్నతులు దక్కినా ఆ స్థాయి జీతం మాత్రం దక్కడం లేదు. ఈ ఏడాది మార్చి నెలలో 76 మంది హిందీ పండిట్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించినా నేటికీ ఎస్జీటీ స్థాయి జీతాలే చెల్లిస్తున్నారు. ఐదు రోజుల కిందట మరో 87 మంది పండిట్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించినా వీరికి కూడా పెరిగిన జీతాలు అందే పరిస్థితి లేదు. వీరంతా డీఈఓ పూల్‌లో ఉంటూ ఎస్జీటీ పోస్టులో కొనసాగుతున్నారు. ఎక్కడ పని చేస్తున్న వారికి అక్కడే పదోన్నతులు కల్పించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆ మేరకే జిల్లా స్థాయిలో ఉత్తర్వులు వెలువరించారు. ఖజానా శాఖ వద్ద ప్రస్తుతం వారు పనిచేస్తున్న ఎస్జీటీ స్థాయి సమాచారమే ఉండడంతో ఆ మేరకే జీతాలు చెల్లిస్తున్నారు.

చిత్తశుద్ధి ఉంటే..

వాస్తవానికి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పోస్టులను అప్‌డేట్ చేయాలి. కానీ అలా చేయకుండా పండిట్లను మభ్యపెడుతూ పదోన్నతులు కల్పించినట్లు ప్రచారం చేస్తున్నారు. 2019లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పండిట్ పోస్టులను రద్దు చేసి, వారందరినీ స్కూల్ అసిస్టెంట్లుగా పరిగణిస్తూ ఉత్తర్వులు వెలువరించారు. అనాడే వీరందరి కేడర్ స్కూల్ అసిస్టెంట్ స్థాయిగా మారిపోయింది. అయితే జిల్లాలో అప్పటికి ఉన్న ఖాళీల మేరకు భర్తీలు జరిపి, మిగిలిన వారిని డీఈఓ పూల్‌లో ఉంచారు. పదవీ విరమణ ద్వారా ఖాళీ అయిన స్థానాల్లో వీరిని భర్తీ చేయడం ద్వారా సమస్య పరిష్కరించే అవకాశం ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం అలా కాకుండా మార్చి నెలలో కోర్టు ఆదేశాల మేరకు ఓ 76 మందికి పదోన్నతులు కల్పించగా, వారంతా ఎస్జీటీ పోస్టుల్లోనే ఉండడం వల్ల స్కూల్ అసిస్టెంట్ జీతాలు అందడం లేదు. ఈ సమస్యను పరిష్కరించకుండానే, తాజాగా మరో 87 మందికి పదోన్నతి చేస్తున్నట్లు ఉత్తర్వులు వెలువరించారు. ఇది కేవలం పండిట్ల కంటి తుడుపు చర్య మాత్రమే తప్ప ఏ మాత్రం లబ్ధి చేకూరదు.

ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు రేషనలైజేషన్ చేసి పలు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను రద్దు చేసిన విషయం తెలిసిందే. అలా కాకుండా ఆయా పోస్టుల్లోనే పండిట్లకు పదోన్నతులు కల్పించి ఉంటే జీతాల సమస్య తలెత్తేది కాదు. మార్చిలో పదోన్నతులు పొందిన పలువురు పండిట్లు, స్కూల్ అసిస్టెంట్ జీతాల కోసం బిల్లులను ఖజానా శాఖకు దఖలు చేయగా దాన్ని తిరస్కరించినట్లు పలువురు పండిట్లే బహిరంగంగా చెబుతున్నారు. ఇదిలా ఉంటే మార్చి నెలలో పదోన్నతులు పొందిన పండిట్లకు ఇచ్చిన ఉత్తర్వుల్లో 2019 నుంచి వీరికి పదోన్నతులు కల్పిస్తున్నట్లు పేర్కొంటూ, ఆ కాలాన్ని నేషనల్ సీనియారిటీగా పేర్కొని ఆ కాలానికి ఇంక్రిమెంట్లు కూడా మంజూరు చేసినట్లు పొందుపరిచారు. దీని ఆధారంగా కొందరు పండిట్లు స్కూల్ అసిస్టెంట్ జీతంతో పాటు ఎరియర్స్ మంజూరునకు సంబంధించిన బిల్లులను కూడా ఖజానా శాఖకు దాఖలు చేయగా వాటన్నింటినీ అన్ని మండలాల్లోనూ తిరస్కరించినట్లు సమాచారం.

నా దృష్టికి రాలేదు

మార్చిలో 76 మందికి తాజాగా 87 మందికి పండిట్ల నుంచి స్కూల్ అసిస్టెంట్‌కు పదోన్నతులు కల్పించాం. గతంలో పదోన్నతి పొందిన వారికి స్కూల్ అసిస్టెంట్ జీతాలు అందడం లేదనే విషయం నా దృష్టికి రాలేదు. దీనిపై పరిశీలన చేసి రాష్ట్రస్థాయికి నివేదిస్తాం. ఈ వ్యవహారం రాష్ట్రస్థాయిలోనే పరిష్కారమవ్వాల్సి ఉంటుంది.

– రవిబాబు, జిల్లా విద్యాశాఖ అధికారి

స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానం



స్వచ్ఛ అవార్డులు పొందిన వారితో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యేలు

ప్రజా జీవితంలో పరిశుభ్రతను భాగం చేసుకోవాలని, చెత్తను సంపదగా మార్చాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం అంబేడ్కర్ ఆడిటోరియంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర అవార్డులు–2025 ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి 95 శాతం ఇంటింటికీ చెత్త సేకరణ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. అలాగే బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా 623 గ్రామాలను ప్రకటించామని, జిల్లాలో మొత్తం తొమ్మిది మానవ ఘన వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇలాంటి చర్యల ఫలితంగా రాష్ట్ర స్థాయిలో రెండు, జిల్లా స్థాయిలో 46 స్వచ్ఛ అవార్డులు లభించాయని కలెక్టర్ ప్రకటించారు. ప్రతి సచివాలయంలోనూ ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి, పౌరుల నుంచి సేకరించిన కిలో చెత్తకు రూ.10 చెల్లిస్తామని తెలియజేసారు. అనంతరం రాష్ట్ర స్థాయి అవార్డులు సాధించిన నేలబొంతు ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ బాలికల పాఠశాల, శ్రీ గౌరిశంకర మహిళా సమాఖ్యను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే జిల్లా స్థాయిలో పారిశుద్ధ్య కార్మికులతో పాటు స్వచ్ఛతకు ప్రాధాన్యతనిచ్చిన వారిని గుర్తించి మొత్తం 46 మందికి అవార్డులను ప్రదానం చేశారు. – అరసవల్లి

అక్రమాలకు ఆనవాళ్లివే..!



తొగరాం గ్రామం వద్ద రహదారి దుస్థితి

ఆమదాలవలసలో అక్రమ ఇసుక దందాకు అడ్డూఅదుపు లేకుండాపోతోంది. నిరంతరం ఇసుక వాహనాలు తిరుగుతుండడం వల్ల దారులు కూడా దారుణంగా మారిపోతున్నాయి. ముఖ్యంగా రాగోలు నుంచి కొత్తవలసకు వెళ్లే దారి పరమ అధ్వానంగా మారింది. ఇదే దారిలో పెద్దదూసి, దూసిపేట, కొత్తవలస, పాతూరు, నిమ్మతొర్లివాడ తదితర గ్రామాల్లో అక్రమ ఇసుక వ్యాపారం ముమ్మరంగా జరుగుతోంది. తుఫాన్ వచ్చినా దందా ఆగడం లేదు. దారులు ఇలా గోతులమయంగా మారడంతో జనం అవస్థలు పడుతున్నారు. – ఆమదాలవలస రూరల్



ఆమదాలవలస రూరల్ మండలం కలివరం గ్రామం వద్ద గోతులమయంగా రహదారి

రక్త చిత్తరువు



- రక్తం ఇచ్చి, ఆత్మీయుల చిత్రాలు గీయించుకుంటున్న ఔత్సాహికులు
- చార్‌కోల్ ఆర్ట్‌కు కూడా పెరుగుతున్న ఆదరణ

శ్రీకాకుళం కల్చరల్:

సిరాతో, రంగులతో, అల్లికలతో, బొగ్గులతో వాటర్ పెయింట్లు, ఆయిల్ పెయింట్లతో చిత్తరువులు తయారు చేయడం అందరికీ తెలిసిందే. కానీ కొత్తగా రక్తంతో కూడా బొమ్మలను గీయించుకుంటున్నారు. శ్రీకాకుళంలోని యువ చిత్రకారుడు డి.లాల్‌ప్రసాద్ రకరకాల ఆర్ట్‌లతో ప్రత్యేకత కనబరుస్తున్నాడు. నగరంలోని కంపోస్టు కాలనీలో నివాసముంటున్న దాకోజు లాల్ ప్రసాద్ ఒక ప్రైవేటు కంపెనీలో ఆర్టిస్టుగా పనిచేస్తున్నాడు. తన తండ్రి, పెదనాన్నల శరత్ ఆర్ట్స్, అరుణ్ ఆర్ట్స్ పేరును నిలబెడుతున్నాడు. లాల్ తండ్రి గోపాల్‌రావు అరుణ్ ఆర్ట్స్ పేరుతో బొమ్మలు వేయడం, నేమ్ బోర్డు రాయడంలో ఎంతో పేరు సంపాదించారు. తండ్రి చనిపోగా లాల్ ప్రసాద్ ఇంటర్‌లో చదువు ఆపేశాడు. చిత్రకళపై ఉన్న మక్కువతో చిత్రాలు గీయడం ప్రారంభించాడు. రక్తంతో కూడా చిత్రాలు అందంగా గీయవచ్చని రుజువు చేస్తున్నాడు. అలాగే చార్‌కోల్ ఆర్ట్‌ను కూడా ప్రత్యేకంగా నేర్చుకున్నాడు. మొదటిగా అభిమాన హీరో ప్రభాస్ బొమ్మ గీసి అభిమానాన్ని చాటుకున్నాడు. సోనూ సూద్ బొమ్మనుకూడా గీశాడు. ఇందు కోసం కేవలం 3ఎంఎల్ రక్తం మాత్రమే అవసరమవుతుంది.

1500 కుపైగా చిత్రాలు

కొత్తగా చార్‌కోల్ ఆర్ట్ ద్వారా గీస్తున్న చిత్రాలకు మంచి గిరాకీ పెరిగింది. దీంతో తమ కుటుంబ సభ్యుల చిత్రాలను, ఆత్మీయుల చిత్రాలను గీయించుకునేందుకు ఔత్సాహికులు ఉత్సాహపడుతున్నారు. అలాగే తమ రక్తాన్ని ఇచ్చి తమ తల్లిదండ్రులు, భార్యాభర్తలు, పుట్టిన రోజు, పెళ్లిరోజు ఇలాంటి ప్రత్యేక రోజుల్లో చిత్రాలను గీయిస్తున్నారు. ఒక చిత్రం గీయడానికి రెండుగంటలు పడుతుంది.

రెండురోజుల ముందు చెప్పాలి



ప్రస్తుత కాలంలో రక్తంతో తమ ఆత్మీయుల చిత్రాలు గీయించడానికి ఎందరో వస్తున్నారు. పెళ్లిళ్లకు, పుట్టిన రోజులకు ప్రత్యేక రోజుల్లో కేవలం తమ కుటుంబ సభ్యుల చిత్రాలను గీయిస్తున్నారు. అయితే రెండు రోజుల ముందుగానే చెప్పాలి.

– డి.లాల్‌ప్రసాద్, చార్‌కోల్ ఆర్ట్ కళాకారుడు





ప్రసాద్ గీసిన చిత్రాలు

క్లుప్తంగా

ప్రాణాలు తీసిన విద్యుత్ తీగలు



చంటి మృతదేహం

మెళియాపుట్టి: మండలంలోని గంగరాజపురం గ్రామానికి చెందిన యువకుడు గూడపు చంటి(29) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని మున్నాజెన్నా అనే వ్యక్తి ఇంటిపై చెట్టుకొమ్మలు విద్యుత్ తీగలకు తగిలి ఉండడంతో ఒడిశాలోని జంగాలపాడు గ్రామానికి చెందిన శరత్ అనే యువకుడు మృతుడు చంటిని ఆ కొమ్మలు తొలగించడానికి సాయంగా రమ్మన్నాడు. దీంతో విద్యుత్ సరఫరా ఉండగానే చెట్టు కొమ్మలను చంటి తొలగిస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి అక్క దమయంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. తల్లిదండ్రులు కొద్దికాలం క్రితమే మృతి చెందారు. అతడు విజయవాడలోని ఒక ప్రైవేట్ కంపెనీలో వెల్డింగ్ కార్మికునిగా పనిచేసేవాడు. ఇటీవల వినాయక చవితికి గ్రామానికి వచ్చాడు. మంగళవారం విజయవాడ బయల్దేరి వెళ్లడానికి సిద్ధమవ్వగా.. ఇంతలో ప్రమాదం చోటుచేసుకోవడంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కంచిలి: మండలంలోని గొల్ల కంచిలి నుంచి కంచిలి వెళ్లేమార్గంలో మఠం చెరువు సమీపంలో రైల్వేట్రాక్‌పై సుమారు 55 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయాన్ని పలాస జీఆర్పీ పోలీసులు సోమవారం గుర్తించారు. ప్రమాదంలో మృతుని ముఖం గుర్తుపట్టలేని విధంగా తయారైంది. మృతుడి శరీరంపై ఆరెంజ్, తెలుపు రంగు కలిగిన గడుల తువ్వాలు మాత్రమే ఉందని తెలిపారు. మరిన్ని వివరాలకు 94406 27567, 99891 36143 నంబర్లను సంప్రదించాలని కోరారు.

తప్పిన పెను ప్రమాదం



మృతి చెందిన ఆవు

జి.సిగడాం: మండలంలోని మర్రివలస పంచాయతీ మానంపేట గ్రామంలో ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో విద్యుత్ తీగ తెగిపడిన సమయంలో పెను ప్రమాదం తప్పింది. గ్రామానికి చెందిన బాడిత కనకలక్ష్మికి చెందిన ఆవుకు విద్యుత్ తీగ తగలడంతో మృత్యువాత పడింది. ఇదే సమయంలో కనకలక్ష్మికి సైతం విద్యుత్ తీగ తగలడంతో షాక్‌కు గురయింది. వెంటనే గ్రామస్తులు అప్రమత్తమై కర్రలతో విద్యుత్ తీగను తొలగించారు. అనంతరం ఆమెను హుటాహుటిన రాజాం ఆస్పత్రికి తరలించారు. ఆమె ప్రస్తుతం చికిత్స పొందుతోంది. వ్యవసాయం కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ మానంపేట మీదుగా ఉండడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వ్యవసాయ కోసం ఏర్పాటు చేసిన లైన్లు మార్చాలని కోరుతున్నారు.

ద్విచక్ర వాహనం దొంగకు జైలు శిక్ష

నరసన్నపేట: ద్విచక్ర వాహనం దొంగతనం కేసులో సారవకోట మండలం బుడితికి చెందిన కొర్ల శివకు ఆరు నెలల జైలుశిక్ష, రూ.500ల జరిమానాను నరసన్నపేట జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాణి విధించారు. వివరాల్లోకి వెళ్తే.. ఎచ్చెర్ల మండలం యాతపేటకు చెందిన సోడి పైడిరాజు ద్విచక్ర వాహనం నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పార్క్ చేయగా చోరీకి గురైంది. ఈ మేరకు ఈ ఏడాది మే 30న నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం కొర్ల శివను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో చార్జిషీట్ పోలీసులు వేయగా, నరసన్నపేట జూనియర్ సివిల్ జడ్జి విచారణ చేపట్టారు. సోమవారం కొర్ల శివను దొంగగా నిర్ధారించి జైలుశిక్ష ఖరారు చేశారు. కేసులో ఏపీపీగా శాంతి సంతోషి వ్యవహరించారు. ఈ మేరకు నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

పలాస: మందస మండలం మఖరజోల గ్రామ పంచాయతీ పరిధి అల్లిమెరక కాలనీలో నివాసముంటున్న కొండ కురమ్మ (22) సోమవారం పలాస మండలం రంగోయి గేటు సమీపంలోని ఒక జీడి తోటలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కురమ్మ తల్లి గాది పద్మ, కాశీబుగ్గ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కురమ్మ భర్త చంద్రశేఖర్ కత్తర్‌కు వలస కూలీగా గతేడాది వెళ్లాడు. కురమ్మకు కడుపులో నొప్పి ఉంది. ఇటీవల సోంపేట మండలం జురాబంద గ్రామంలో ఉన్న తన తల్లి వద్దకు వెళ్లింది. కడుపులో నొప్పి ఉందని చెప్పడంతో సోంపేటలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చూపించారు. కన్నవారి ఇంటి నుంచి వచ్చిన కురమ్మ ఇంతలోనే ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కాశీబుగ్గ ఎస్ఐ ఆర్ నరసింహమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి భర్తతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.



వృథాగా వంశధార!

- నేరడి ఊసెత్తని చంద్రబాబు సర్కారు
- ఒడిశాలో అనుకూల ప్రభుత్వం ఉన్నా పట్టించుకోని వైనం
- సరిహద్దు జలాల సమస్యకు కలగని మోక్షం
- అప్పట్లో ఎంతో చొరవచూపిన జగన్‌మోహన్‌రెడ్డి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతోంది. ఏపీలో కూటమి, ఒడిశాలో బీజేపీ ఒకేసారి అధికారంలోకి వచ్చాయి. కేంద్రంలోని ఎన్డీఏలో టీడీపీ కీలక భాగస్వామి. ఏపీలోనూ కూటమి ప్రభుత్వంలో బీజేపీ ఉంది. అయినప్పటికీ పొరుగున ఉన్న ఒడిశాతో జల వివాదానికి మాత్రం పరిష్కారం చూపలేకపోతోంది.

హిరమండలం:

అప్పట్లో ప్రధాని పదవికి అవకాశం వచ్చినా తృణప్రాయంగా వదులుకున్నా.. అంటూ టీడీపీ అధినేత చంద్రబాబు తరచూ ప్రగల్భాలు పలుకుతుంటారు. నాడు కేంద్ర ప్రభుత్వం వద్ద ఉన్న పరపతిని ఉపయోగించుకొని రాష్ట్రానికి ఒక్క ప్రాజెక్టూ తీసుకురాలేదు. కనీసం ఒడిశాతో జల వివాదాలను సైతం పరిష్కరించలేదు. నాటి ఒడిశా పాలకపక్షం బీజేడీ భాగస్వామ్య పార్టీ అయినా చొరవచూపలేదు. ఇప్పుడు కూడా అక్కడ తమ మిత్రులైన బీజేపీ ప్రభుత్వం ఉన్నా సీఎం చంద్రబాబు చొరవ చూపించడం లేదు. జిల్లా కూటమి నేతలు దృష్టిపెట్టిన దాఖలాలు లేవు. ఫలితంగా ఇప్పటికీ వంశధారకు సంబంధించి జల వివాదం కొనసాగుతోంది. శ్రీకాకుళం జిల్లా రైతాంగానికి శాపంగా మారుతోంది.

ప్రత్యేక దృష్టి..

2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక శ్రీకాకుళం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులపై అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టి సారించారు. ఒడిశాతో జల వివాదాలు పరిష్కరించుకోవడానికి సిద్ధమయ్యారు. వంశధార నదీ జలాల వినియోగ వివాదాన్ని ఇరు రాష్ట్రాలు సామరస్యపూర్వకంగా చర్చించి పరిష్కరించుకోవాలని వంశధార ట్రిబ్యునల్ ఆదేశించిన నేపథ్యంలో 2022లో అప్పటి ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్‌కు లేఖ రాశారు. నేరడి బ్యారేజీ నిర్మాణానికి సహకరించాలని కోరారు. సామరస్యపూర్వకంగా సమస్యలను పరిష్కరించుకుందామని లేఖలో పేర్కొన్నారు. నేరుగా నవీన్‌తో చర్చలు జరిపారు. నేరడి విషయంలో ఇరు రాష్ట్రాల ప్రయోజనాలకు అనుగుణంగా ముందుకెళ్దామని నిర్ణయించుకున్నారు. అయితే 2024 ఎన్నికల్లో రెండు చోట్లా ప్రభుత్వాలు మారిపోయాయి. ఇరు రాష్ట్రాల్లో రెండు అనుకూల ప్రభుత్వాలు వచ్చినా నేరడి విషయంలో మాత్రం అడుగు ముందుకు పడటం లేదు.

ప్రతిపాదనలతో సిద్ధం..

నేరడి జలాశయం నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.650 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు రూపొందించింది. కానీ ఒడిశా అభ్యంతరాలు, నిర్మాణ ప్రాంతం రెండు రాష్ట్రాల ఉమ్మడి ప్రాంతం కావడంతో అడుగు ముందుకు పడడం లేదు..ఎ ఇక్కడ బ్యారేజీ నిర్మించాలంటే ఒడిశా భూభాగం పరిధిలోని 106 ఎకరాలను ఏపీకి అప్పగించాలి. ఈ విషయంలో వంశధార ట్రిబ్యునల్ ఆదేశాలను సైతం ఒడిశా తుంగలో తొక్కింది. కేంద్ర జల సంఘం అధికారుల ఆధ్వర్యంలో సర్వే చేయాలన్న సూచనలను బేఖాతరు చేసింది. సహాయ నిరాకరణతో బ్యారేజీ నిర్మాణానికి అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తూ వచ్చింది. అందుకే అప్పటి సీఎంగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి లేఖ రాయడమే కాకుండా.. నేరుగా అప్పటి సీఎం నవీన్ పట్నాయక్‌ను కలిసి సమస్యలపై చర్చించారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు అటువంటి ప్రయత్నం చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

నాడే ఒప్పందం జరిగినా..

వాస్తవానికి నేరడి బ్యారేజీ నిర్మాణానికి 1961లో ఒప్పందం కుదిరింది. సాధారణంగా వంశధారలో 115 టీఎంసీల నీటి లభ్యత ఉంటుంది. ఏపీ, ఒడిశాలు సమానంగా నీటిని పంచుకోవాలన్నది ఒప్పందం. కానీ వంశధారపై నీటి ప్రాజెక్టులు నిర్మిస్తే నీటి వినియోగం సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో నేరడి బ్యారేజీ నిర్మాణం తెరపైకి వచ్చింది. కానీ ఒడిశా అడుగడుగునా అడ్డంకులు సృష్టించడంతో ఏపీ ప్రత్యామ్నాయ ప్రాజెక్టులపై దృష్టిపెట్టింది. అందులో భాగంగానే హిరమండలం వద్ద గొట్టా బ్యారేజీ నిర్మాణం చేపట్టారు. ఈ ప్రాజెక్టు జిల్లాలో సగం మండలాలను సస్యశ్యామలం చేస్తోంది. కానీ వంశధారలో వరద నీరు వృథాగా సముద్రంలో కలిసిపోతోంది. ఈ నేపథ్యంలో 2004లో అధికారంలోకి వచ్చిన దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వంశధార మిగులు జలాలపై దృష్టిసారించారు. అదే సమయంలో ఒడిశాతో జల వివాదం నడుస్తుండడంతో ప్రత్యామ్నాయంగా వంశధార ఫేజ్–1 నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కేవలం వరద నీటి మళ్లింపుతో చేపట్టిన ఈ పథకం నిర్మాణం దాదాపు పూర్తయ్యింది. కానీ నేరడి ప్రాజెక్టుకు మాత్రం ముందుకు అడుగుపడలేదు. ఈ పరిస్థితిని గమనించిన జగన్‌మోహన్‌రెడ్డి ఒకవైపు ఒడిశాతో జల వివాదం పరిష్కరించుకుంటూనే.. గొట్టా బ్యారేజీలో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి నీటిని వంశధార రిజర్వాయర్‌లోకి మళ్లించే చర్యలు చేపట్టారు. వంశధార ఫేజ్–2 పథకం నిర్మాణం పూర్తయితే 2.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు అదనంగా నీరందే అవకాశముంది.

8 ఏళ్ల కిందట గ్రీన్‌సిగ్నల్

వాస్తవానికి నేరడి బ్యారేజీ నిర్మాణానికి వంశధార ట్రిబ్యునల్ ఎనిమిది ఏళ్ల కిందట అంగీకరించింది. 2017 సెప్టెంబరు 13న తీర్పును వెలువరించింది. నాటి ప్రభుత్వం తగిన రీతిలో స్పందించకపోవడం, ఒడిశాకు దీటుగా పోరాడకపోవడంతో ఎలాంటి అడుగుపడలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కదలిక వచ్చింది. ఒకవైపు ఒడిశాను అభ్యర్థిస్తునే మరోవైపు న్యాయపోరాటానికి సన్నద్ధమైంది. నేరడి బ్యారేజీ నిర్మాణానికి అవసరమైన ఒడిశా పరిధిలోని 106 ఎకరాల భూమిని అప్పగించాలని కోరారు. ఏకంగా భువనేశ్వర్ వెళ్లి సీఎం నవీన్ పట్నాయక్‌ను కలిశారు. ఇప్పుడు చంద్రబాబు అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటుతున్నా కనీస ప్రయత్నాలు చేయడం లేదు. అలాగని గొట్టా బ్యారేజీలో నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేయడం లేదు.

మాకు అదే పనేంటి..?

- జేఆర్‌పురం సీఐ అవతారం సమాధానం వైరల్

రణస్థలం: భజరంగ్ దళ్ జిల్లా కార్యదర్శి కె.కిరణ్‌కుమార్ శ్రీకాకుళం వైపు నుంచి ఎచ్చెర్ల జాతీయ రహదారి మీదుగా వ్యాన్‌లో ఆవుల అక్రమ రవాణా జరుగుతోందని జేఆర్‌పురం సీఐ అవతారంనకు కాల్ చేయగా 'మాకు ఇప్పుడు అదే పనేంటి' అని సీఐ మాట్లాడిన కాల్ రికార్డింగ్‌ను భజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు సోషల్ మీడియాలో సోమవారం వైరల్ చేశారు. కాల్ రికార్డులో ఉన్న సారాంశం ప్రకారం ఫోన్ చేసిన వ్యక్తికి స్పందించిన సీఐ అవతారం మాట్లాడుతూ హలో ఎవరూ చెప్పండి అన్నారు. అవతల వ్యక్తి.. సార్ ఆవుల వ్యాన్ ఒకటి వస్తుందని అనగానే మాకు అదే పనేంటి ఇప్పుడు అని ఫోన్ కట్ చేశారు. దీనిపై సీఐ ఎం.అవతారం వివరణ కోరగా.. సాధారణంగా కంట్రోల్ రూమ్‌కు కాల్ చేయాలన్నారు. ఎచ్చెర్ల మండలంలోని ఫరీద్‌పేటలో రాత్రి 2 గంటల వరకు డ్యూటీ చేసి వచ్చి పడుకుంటే.. తెల్లవారుజామున 4 గంటలకు ఫోన్ చేసి ఆవులు వ్యాన్ వస్తుందని అన్నారు. అప్పటికే నిద్రమత్తులో ఉన్నా ఫోన్ లిఫ్ట్ చేశాను. జేఆర్‌పురం పోలీసులు పట్టుకుని చెక్ చేశారు. ఆ పశువులు అలమండ సంతకు రైతులు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు.



వాట్సాప్‌లో వైరల్ అవుతున్న ఆడియో క్లిప్

అపూర్వ సహకారం

పోలాకి: మండలంలోని కోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002–03 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు శభాష్ అనిపించుకున్నారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సాయం అందజేసి గొప్ప మనస్సు చాటుకున్నారు. దసరా సెలవులు పురస్కరించుకొని నాటి విద్యార్థులంతా సోమవారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. దీనిలో భాగంగా అప్పటి గురువులను సత్కరించి తాము చదువుకున్న పాఠశాలలో భోజన శాల నిర్మించేందుకు రూ.2 లక్షల విరాళాన్ని హెచ్‌ఎం జి.శాంతికి అందజేశారు. దీంతో పూర్వ విద్యార్థులకు పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



కోడూరు హైస్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు

రైతన్నా.. జాగ్రత్తన్నా..!

- పురుగు మందుల పిచికారీలో జాగ్రత్తలు అవసరం
- నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ప్రమాదం



పొలంలో మందు పిచికారీ చేస్తున్న రైతు

జలుమూరు: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి పైరుకి ఆశించే తెగుళ్లు, చీడపీడల నివారణలో రైతన్నల బిజీగా ఉన్నారు. ఇదే సమయంలో పంటకు ఆశించే తెగుళ్ల నివారణే లక్ష్యంగా రైతులు పంట పొలాలకు యథేచ్ఛగా క్రిమి సంహారక మందులు పిచికారీ చేస్తున్నారు. కానీ పిచికారీ చేసే సమయంలో భద్రతా చర్యలు తీసుకోవాలని.. లేకుంటే ప్రమాదంతో పాటు ప్రాణహాని సంభవించే అవకాశాలు కూడా ఉంటాయని మండల వ్యవసాయాధికారి కింజరాపు రవికుమార్ హెచ్చరించారు. ఈ మేరకు జాగ్రత్త చర్యలను తెలియజేశారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- మందు పిచికారీకి పరిశుభ్రమైన నీరు వినియోగించాలి.
- పిచికారీ చేసే ముందు నోరు, ముక్కు, కళ్లకు ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలి.
- తలకు టోపీ ధరించి, ముఖానికి ఖచ్చితంగా మాస్క్ పెట్టుకోవాలి.
- పురుగు మందులతో వచ్చిన సీసాలు, సంచులు ఇతర అవసరాలకు ఎట్టి పరిపరిస్థితుల్లోనూ వాడకూడదు.
- డబ్బాపై ఉన్న లేబుళ్లలో చూపినవిధంగా మందులు కలుపుకోవాలి.
- పురుగు మందులు కలిపినా, పిచికారీ చేసినా కళ్లజోడు ధరించాలి లేదంటే వాటి తుంపర్లు కళ్లలోకి వెళ్లే ప్రమాదముంది.
- ద్రావణాన్ని స్ప్రేయర్లలో పోసే ముందు, పొలాల్లో పిచికారి చేసే ముందు బీడి, చుట్ట, సిగిరెట్, ఖైనీ, గుట్కా, పాన్ మసాల వంటివి వినియోగించకూడదు.
- పురుగు మందుల డబ్బాను వాసన చూడకూడదు.
- భోజనానికి ముందు సబ్బుతో కాళ్లు, చేతులు కడుక్కోవాలి.
- పంటపై పిచికారీ చేసే సమయంలో స్ప్రేయర్ నాజిల్ సక్రమంగా ఉందో లేదో చూసుకోవాలి.
- గాలి, ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు మందు ద్రావణాన్ని పిచికారీ చేయకూడదు.
- గాలికి వ్యతిరేక దిశలో కాకుండా వాలుగా ఉన్నప్పుడు ద్రావణాన్ని పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

అవగాహన కల్పిస్తున్నాం



ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి పంటపై అక్కడక్కడ చీడపీడలు వచ్చే అవకాశం ఉంది. దీనికి సంబంధించి పురుగు మందులను పిచికారీ చేసేటప్పుడు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతు భరోసా కేంద్రాలు ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. అలాగే గోడ పత్రికలు కూడా రైతు సేవా కేంద్రాలకు అతికించాము.

– కె.రవికుమార్, వ్యవసాయ అధికారి, జలుమూరు

ఎస్పీ గ్రీవెన్స్‌కు 36 వినతులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఎస్పీ గ్రీవెన్స్‌కు 36 వినతులు అందాయి. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సకాలంలో న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

లేడీ రౌడీ షీటర్‌పై ఎస్పీకి ఫిర్యాదు



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన గ్రామస్తులు

శ్రీకాకుళం క్రైమ్: సరుబుజ్జిలి మండలంలోని మూలసవలాపురానికి చెందిన లేడీ రౌడీషీటర్, ఆమె అనుచరులపై అదే గ్రామానికి చెందిన కొంతమంది ఎస్పీ మహేశ్వరరెడ్డికి సోమవారం ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు వచ్చి తమ గోడు వెల్లబోసుకున్నారు. దందాలు, రౌడీయిజం, సారా, మద్యం, గంజాయి, మాదకద్రవ్యాలు, భూ, ఇళ్ల స్థలాల కబ్జాలు జిల్లా నలుమూలలు చేస్తూ గ్రామ పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని బ్యాంకర్స్ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్న జామి రమేష్ తరపున మధ్యవర్తి సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్నది ఈమె అనుచరులేనన్నారు. అర్ధరాత్రి ఇంటి యజమాని తంగుడు ఉపేంద్ర ఇంట్లో చొరబడి దౌర్జన్యానికి పాల్పడేందుకు యత్నించగా.. స్థానికులు దేహశుద్ధి చేయడంతో వెనుదిరిగారని తెలిపారు. అనేక పోలీస్‌స్టేషన్లలో వీరిపై కేసులున్నాయని పేర్కొన్నారు. ఫిర్యాదు ఇచ్చినవారిలో కె.ధనుంజయ, జి.మోహనరావు, ఎస్.వసంత్ కుమార్, జి.శ్రీధర్ మరో 30 మందికి పైగా ఉన్నారు. కాగా వీరు ఫిర్యాదు చేసిన కొద్ది గంటల్లోనే అవతలి వర్గం వాళ్లూ ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. అక్కడికి కొద్ది క్షణాల్లోనే టౌన్ డీఎస్పీ వివేకానంద, ఒకటో పట్టణ సీఐ పైడపునాయుడు, జె.ఆర్.పురం సీఐ అవతారం ఎస్పీని కలిసేందుకు రావడం చర్చనీయాంశంగా మారింది.

అధికారుల అప్రమత్తతతో నష్ట నివారణ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- పీజీఆర్ఎస్‌కు 104 వినతులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు అధికారులంతా అప్రమత్తంగా ఉండడంతో ఎటువంటి నష్టంజరగలేదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో ఆయన జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని అభినందించారు. ప్లాస్టిక్‌ను నిషేధించేందుకు.. అధికారులంతా స్టీల్ వాటర్ బాటిల్ తీసుకొని రావాలన్నారు. తుఫాన్ల గూర్చి ముందుగానే సమాచారం ఉంటుందని, మూడు రోజులు ముందుగానే సమాచారం తెలియజేస్తే అందరూ జాగ్రత్త పడేందుకు అవకాశం ఉంటుందని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారిని ఆదేశించారు.

వ్యాపారులు హాజరవ్వాలి

జీఎస్టీ 2.0పై ఆయన మాట్లాడుతూ ఈనెల 19వ తేదీన నిర్వహించనున్న జీఎస్టీ ఎగ్జిబిషన్‌కు అధికారులతో పాటు వ్యాపారులు హాజరవ్వాలని కోరారు. వ్యవసాయ పనిముట్లు, మెడికల్ ఇన్సూరెన్సు, నోట్‌బుక్స్ తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయా శాఖల అధికారులు షెడ్యూల్ ప్రకారం ప్రజలకు అవగాహన కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు సంబంధిత ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు.

వినతుల స్వీకరణ

పీజీఆర్ఎస్‌లో భాగంగా మొత్తం 104 అర్జీలు స్వీకరించారు. వీటిలో రెవెన్యూ – 28, మున్సిపల్ కార్పొరేషన్ – 16, పంచాయతీ రాజ్ – 15, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ – 8, ఏపీఈపీడీసీఎల్ – 7, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ – 4, హౌసింగ్ – 3, వాటర్ రిసోర్సెస్ – 3, పౌర సరఫరాల శాఖ – 2, సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ – 2, వ్యవసాయ శాఖ – 2, ప్రజా రవాణా శాఖ – 2, విభిన్న ప్రతిభావంతులు, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపులు, సాంఘిక సంక్షేమ శాఖ, రూరల్ డవలప్‌మెంట్, నైపుణ్యాభివృద్ధి, ఎస్సీ కార్పొరేషన్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పోలీసు, మెడికల్ ఎడ్యుకేషన్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, గిరిజన సంక్షేమ శాఖలకు సంబంధించి ఒక్కొక్కటి చొప్పున అర్జీలు స్వీకరించారు. అర్జీలు స్వీకరణలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కొన్ని వినతులు పరిశీలిస్తే...

- జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు) ఆవరణలో జనరల్ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరిందని, దీని స్థానంలో కొత్త భవనం నిర్మించాలని శ్రీకాకుళం స్టూడెంట్ యూనియన్ ప్రతినిధులు బోర గోపి, ముకుందరావులు కోరారు.
- గుజరాతీపేటలోని లక్ష్మీ టాకీస్ వెనుకనున్న ప్రాంతంలో ఎక్కువగా మురుగు నీరు రోడ్లుపైనే ఉంటోందని, కాలువలు ఏర్పాటు చేయాలని వి.కాశీప్రసాద్, జి.కృష్ణారావు తదితరులు కోరారు.
- పాలకొండ కేంద్రంగా కొత్త జిల్లాను ఏర్పాటు చేయాలని పాలకొండ జిల్లా సాధన సమితి సభ్యులు బుడితి అప్పలనాయుడు తదితరులు విన్నవించారు.
- ఎచ్చెర్ల సీడీపీవో పాపినాయుడు, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాసరావుపై జేసీ విచారణ చేసి 15 రోజులు కావస్తున్నా ఐసీడీఎస్ పీవో ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని బాలామృతం ట్రాన్సు పోర్టు కాంట్రాక్టర్ పైడి వెంకటరమణ రెండోసారి ఫిర్యాదు చేశారు.
- రణస్థలం మండలంలోని తెప్పలవలస గ్రామానికి చెందిన మేడూరి సత్యనారాయణమూర్తి తనకు వారసత్వంగా సంక్రమించిన గ్రామకంఠం భూమిని 15 సంవత్సరాల క్రితం తన కుమార్తెకు రిజిస్ట్రేషన్ చేశాడు. అయితే ఆ భూమిని కొంతమంది వ్యక్తులు వీఆర్‌వో ధ్రువపత్రంతో అక్రమంగా వేరేవారికి అమ్మివేశారని, అందువలన తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు. గ్రామకంఠం భూమి క్రయవిక్రయాలకు వీఆర్‌వో ధ్రువపత్రం చెల్లదని, అయినా రిజిస్ట్రేషన్ చేశారని జేసీ వద్ద వాపోయారు.

పీపీపీ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని దళిత, ఆదివాసీ, బహుజన, మైనార్టీ సంఘాల జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహరనాయుడు ఆధ్వర్యంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులను వైద్య విద్యకి దూరం చేసే విధానాలు ప్రభుత్వం విడనాడాలని కోరారు. ప్రభుత్వమే మెడికల్ కాలేజీలు నిర్వహించాలని విన్నవించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధపడడం దుర్మార్గమని మండిపడ్డారు. లక్షల కోట్లు అప్పులు చేస్తున్న ప్రభుత్వం, మెడికల్ కాలేజీల కోసం అవసరమైన నిధులు ఖర్చు చేయలేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ ఉద్యమంలో పాల్గొనేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు తైక్వాండో శ్రీను, డా.కంతవేణు, ఎస్.వి.రమణ మాదిగ, మహిబుల్లా ఖాన్, అమిరుల్లా బేగ్, రౌతు శంకరరావు, బాడాప దేవభూషణరావు, గుండబాల మోహన్, ఎంఏ బేగ్, పొన్నాడ రుషి, ముంజేటి కృష్ణమూర్తి, యజ్జల గురుమూర్తి, వైశ్యరాజు మోహన్, గద్దెబోయిన కృష్ణారావు, నీలాపు ముకుందరావు, నల్లబారిక శ్రీను, పెయ్యల చంటి, అబ్బాస్, సింకు రమణ, అరిబారిక రాజు, నేతల అప్పారావు, కొత్తూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యమే భవిష్యత్‌కు పునాది



కంచిలి: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఆహార కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి

కంచిలి/సోంపేట/మందస/టెక్కలి: విద్యార్థుల ఆరోగ్యం, ఆహార భద్రతే దేశ భవిష్యత్‌కు పునాది అని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయ ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం పలు హాస్టళ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, చౌక ధరల దుకాణాలను ఆకస్మికంగా ఆయన పరిశీలించారు. విద్యార్థులకు సక్రమంగా నాణ్యమైన భోజనం అందుతుందో లేదోనని తెలుసుకున్నారు. సోంపేట మండలంలోని వాడపాలేం వసతి గృహంలో విద్యార్థులకు వారానికి రెండు గుడ్లు అందజేస్తున్నారని విద్యార్థులు తెలపడంతో.. ఇన్‌చార్జి వార్డెన్ విజయలక్ష్మికి షోకాజ్ నోటీసులు అందజేయమని వెనుకబడిన తరగతుల జిల్లా సంక్షేమాధికారి బి.అనురాధకు ఆదేశాలు జారీ చేశారు. వసతి గృహాల్లో మెనూ సక్రమంగా అమలు చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనల మేరకు విద్యార్థులకు ఇచ్చే గుడ్ల సైజ్ ఉండాలని స్పష్టం చేశారు. స్టాక్ నిర్వహణ సక్రమంగా ఉండాలని, అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫిర్యాదులు వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని, అవసరమైతే సుమోటోగా కేసులు నమోదు చేస్తామని వివరించారు. విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని సూచించారు. లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు డీఎస్‌వో సూర్యప్రకాశ్, ఫుడ్ సేఫ్టీ అధికారి శ్రీరాములు, తూనికలు కొలతల శాఖాధికారి పి.చిన్నమ్మి తదితరులు ఉన్నారు.